క్లుప్తంగా

రేపు పిరమిడ్ వార్షికోత్సవం

హన్వాడ: మండలంలోని దాచక్‌పల్లిలో ఆదివారం మహేశ్వర పిరమిడ్ 11వ వార్షికోత్సవాలు నిర్వహిస్తునట్లు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఉత్సవాలు ప్రారంభించనునట్లు పేర్కొన్నారు. ధ్యానంపై శిక్షణ ఉంటుందని తెలిపారు. ధ్యానులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ముఖ్య అతిథిగా మహేశ్వర మహాపిరమిడ్ ట్రస్టీ దామోదర స్వామి, ఒలంపిక్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్ హాజరవుతారని పేర్కొన్నారు. ధ్యానులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

శ్రీరామకొండపై ప్రత్యేక పూజలు

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని శ్రీరామ కొండ క్షేత్రంలో ఆశ్వీజ దీపావళి అమావాస్య సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలునిర్వహించినట్లు ఆలయ అర్చకులు డీఎం. రాఘవేందర్‌రావు తెలిపారు. శ్రీసీతారామాంజనేయ స్వామి వారిని ప్రత్యేక పూలతో అలంకరించి శతనామావళి పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

నేడు మార్కెట్‌లో లావాదేవీలు

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డుకు దీపావళి పండుగ సందర్భంగా రెండు రోజులు సెలవులు రాగా తిరిగి శనివారం మార్కెట్‌లో లావాదేవీలు ప్రారంభం అవుతాయి. ప్రస్తుతం ధాన్యం సీజన్ ప్రారంభం కావడంతో మార్కెట్‌కు పెద్దఎత్తున ధాన్యం అమ్మకానికి వస్తున్నది. శుక్రవారం సెలవు అయినప్పటికీ రైతులు వివిధ గ్రామాల నుంచి కోతలు కోసిన వరి ధాన్యాన్ని ట్రాక్టర్లలో నింపుకొని మార్కెట్‌కు తెస్తున్నారు. ఇప్పటికే మార్కెట్ యార్డు అంతా వరి ధాన్యం కుప్పలతో నిండి పోయింది. శనివారం మధ్యహ్నం టెండర్ల తరువాత ధరలు వెల్లడి అవుతాయి.

వల్లభాయ్ పటేల్ అందరికీ స్ఫూర్తి

జడ్చర్ల: భారత నవ నిర్మాత సర్దార్ వల్లభాయ్ పటేల్ అందరికీ స్ఫూర్తి అని వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు జగ్‌పాల్‌రెడ్డి అన్నారు. సర్దార్ జయంతిని పురస్కరించుకొని గురువారం బాదేపల్లి ఎస్‌వీపీ నగర్‌లో వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సర్దార్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ పట్టణ అధ్యక్షుడు అఖిల్‌రెడ్డి, భజరంగ్‌దళ్ అధ్యక్షుడు నికిత్, రాధాక్రిష్ణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గంగాపురంలో పెద్ద దుందువా

జడ్చర్ల టౌన్: కార్తీక మాసం పురస్కరించుకుని మండలంలోని గంగాపురం గ్రామంలో శనివారం పెద్ద దుందువా కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రతి ఏటా కార్తీకమాస పాడ్యమి రోజున దుందువా వేడుకలు జరుపుకుంటారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా హరిజనులు తెల్లవారుజామున స్నానాదులు ఆచరించి పొలాల్లోంచి వావిలి, కంది, జీనుగ, గోగునార కట్టెలు తీసుకువచ్చి మూడు అడుగుల వెడల్పు, కనీసం 100 అడుగుల పొడవు ఉండేలా వరితాళ్లతో దుందువాను తయారు చేస్తారు. సుమారు 50మంది దుందువా తయారి చేసేవారు పూర్తయ్యే వరకు నిష్ఠతో ఉండటం విశేషం. తయారు చేసిన దుందువాను రాత్రి లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం వద్దకు తీసుకువెళ్లి అక్కడ పూజలు చేసిన అనంతరం ఒకవైపు నిప్పుపెడతారు. నిప్పుపెట్టిన దుందువాను గ్రామ వీధుల్లోకి యువకులు లాక్కెళ్లటం ప్రత్యేకత.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

జడ్చర్ల టౌన్: వరంగల్ జిల్లా కే.సముంద్రంలో శనివారం నుంచి నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ బాస్కెట్ బాల్ టోర్నీకి మున్సిపాలిటీ పరిధిలోని ప్రేరణ బ్రిలియంట్ పాఠశాల విద్యార్థిని సభ ఎంపికైంది. ఈ మేరకు శుక్రవారం పాఠశాల ప్రిన్సిపాల్ గోపినాథ్ విద్యార్థినిని అభినందించారు. పోటీల్లో రాణించి పాఠశాలకు, మున్సిపాలిటీకి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పీఈటీ బాలు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన

స్టేషన్ మహబూబ్‌నగర్: గాజులపేట గాజేశ్వర నాట్యకళా మండలి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో శనివారం ఉదయం 9.30 గంటల నుంచి శ్రీసత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకంలోని అంకాల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు, ప్రముఖ కళాకారుడు బంగారు పెద్ద వెంకటయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతున్న గురువులకు ఘన సన్మానం చేస్తున్నట్లు తెలిపారు.

వెలుగుల దీపావళి

నవాబుపేట/ మిడ్జిల్ : చీకట్లను పారదోలుతూ వెలుగులు విరజిమ్మే వెలుగుల దీపావళిని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గురు, శుక్రవారాలు దీపావళి సందర్భంగా గ్రామాలన్నీ టపాసుల మోత మోగాయి. నోములు, వ్రతాలతో ప్రజలు భక్తి పారవశ్యంలో మునిగి పోయారు. దీపావళికి చాలా మంది గౌరి నోములు చేయగా మరి కొందరు వ్రతాలు, లక్ష్మీపూజ చేశారు. వ్యాపారులు దుకాణాల దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహమ్మదాబాద్: మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో దీపావళి పండుగను ఘనంగా జరుపుకున్నారు. గాధిర్యాల్ గ్రామంలోని హనుమాన్ ఆలయంలో మహిళలు 108దీపాలను వెలింగిచి మొక్కులు తీర్చుకున్నారు.


మిడ్జిల్ మండలంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


నవాబుపేటలో చిన్నారులతో పాటు టపాసులు కాలుస్తున్న కుటుంబ సభ్యులు


జడ్చర్లలో..


గాధిర్యాల్ హనుమాన్ ఆలయంలో దీపారాధన చేస్తున్న మహిళలు గ్రామస్తులు

కమతం సేవలు మరువలేనివి

మహమ్మదాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి కమతం రాంరెడ్డి సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేఎం నారాయణ తెలిపారు. కమతం జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ కమతం రాంరెడ్డి మార్కెటింగ్, గిడ్డంగుల, రెవెన్యూశాఖా మంత్రిగా ఉండి ఉమ్మడి రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. పరిగి నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా లక్నాపూర్, అంతారం, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను నిర్మించి, పుట్టపహాడ్‌లో 133/11కేవీ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారన్నారు. నంచర్లగేట్‌లో మినీ ఇండస్ట్రీని ప్రారంభించి ఎంతో మందికి పనులను కల్పించారని గుర్తుకు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆయన తనయుడు మాజీ డీసీసీబీ చైర్మన్ కమతం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శాంతీబాయి, విష్ణు, అనంతయ్య గుప్త, పాల్గుణ, లక్ష్మీకాంత్, ఈసా, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.


కమతం రాంరెడ్డి జయంతిలో పాల్గొన్న నాయకులు

ఏ ఒక్క ఇంటిని వదలొద్దు

అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

జడ్చర్ల టౌన్: ఏ ఒక్క ఇంటిని వదలకుండా ప్రతి కుటుంబాన్ని గణన చేసేందుకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని హౌజింగ్‌బోర్డు కాలనీ రోడ్‌నెం.7లో కులగణన కోసం ఎన్యూమరేటర్లు ఇంటింటికి స్టిక్కరింగ్ వేసే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎన్యూమరేటర్ పరిధిలో 3వ తేదీ వరకు అన్ని ఇళ్లు కవర్ అయ్యేలా చూడాలన్నారు.అలాగే నిర్ణీత గడువులోగా స్టిక్కరింగ్ పూర్తిచేసి గణనకు సిద్ధమయ్యేలా సిబ్బందిని ఆదేశించాలని కమిషనర్‌కు సూచించారు. మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, ఆర్ఓ ప్రవీణ్, ఎన్యుమరేటర్ ఉన్నారు.

మెటీరియల్ పంపిణీ

కులగణనకు సంబంధించిన స్టిక్కర్లు, ఇతర మెటీరియల్‌ను శుక్రవారం జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఎన్యుమరేటర్లకు మెటీరియల్ అందజేశారు.


కులగణన స్టిక్కరింగ్ పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

226మంది ఎన్యూమరేటర్లు

కులగణన కోసం స్టిక్కరింగ్ వేసే కార్యక్రమంలో జడ్చర్ల మండలంలో మొత్తం 226మంది ఎన్యూమరేటర్లు విధుల్లో పాల్గొంటున్నారు. మున్సిపాలిటీ పరిధిలో 121 మంది, గ్రామాల్లో 105మంది ఎన్యుమరేటర్లు శుక్రవారం స్టిక్కరింగ్ ప్రారంభించారు. ఒక్కో ఎన్యుమరేటర్ పరిధిలో 165 ఇళ్లు వచ్చేలా కేటాయించారు. కొత్తతండా గ్రామ పంచాయతీలో ఎంపీడీఓ విజయ్‌కుమార్, చిట్టిబోయిన్‌పల్లిలో ఎంపీఓ సరోజ స్టిక్కరింగ్‌ను పరిశీలించారు.

కౌకుంట్ల అభివృద్ధికి సహకరించండి

మంత్రి పొంగులేటికి వినతి

దేవరకద్ర రూరల్: కౌకుంట్ల మండలంలో అన్ని రకాల వసతులు ఏర్పాటుకు కృషి చేయాలంటూ శుక్రవారం ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థులు రెవన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. కౌకుంట్లను మండలంగా ప్రకటించి రెండేళ్లు అవుతున్నా అభివృద్ధి జరగలేదని వారు మంత్రికి వివరించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ రెడ్డి, మండల అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి, కురుమూర్తి దేవస్థాన చైర్మన్ గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

కోయిల్‌కొండ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని పీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి పాఠశాలల బాలబాలికల ఖోఖో పోటీలను ఎంఈఓ వెంకటాజీతో కలిసి ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని, క్రీడాభివృద్ధికి కృషి చేస్తోందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజర్ మెగులాల్, ఎమ్మెల్సీ శ్రీనివాస్, పీఎంఓ బాలుయాదవ్, నాయకులు రవీందర్, విద్యాసాగర్, కృష్ణయ్య, యాదవ్‌కుమార్, పీఈటీ రాష్ట్ర అధ్యక్షులు నిరంజన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పోటీ పడుతున్న నారాయణపేట-మహబూబ్‌నగర్ జట్లు

గెలుపు కోసం శ్రమించాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: ఓడినవారు నిరాశచెందకుండా మళ్లీ గెలుపు కోసం శ్రమించాలని ప్రముఖ విద్యావేత్త లక్ష్మణ్‌గౌడ్ అన్నారు. స్థానిక ఎండీసీఏ మైదానంలో 3వ జలజం సత్యనారాయణ టీ-10 ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నీ ఉత్సాహంగా కొనసాగుతోంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌ల్లో లక్ష్మణ్‌గౌడ్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. పాఠశాలల జట్లు టోర్నీలో సత్తా చాటుతున్నాయి. కార్యక్రమంలో ఏపీజీవీబీ చీఫ్ మేనేజర్ రవీందర్‌గౌడ్, పీఈటీలు వినోద్‌కుమార్, అరుణ్ కుమార్, నాసర్, బాలు తదితరులు పాల్గొన్నారు. మూడో రోజు జరిగిన మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ జట్టు 9 పరుగుల తేడాతో లుంబిని హైస్కూల్ జట్టుపై, మరో మ్యాచ్‌లో లుంబిని హైస్కూల్ జట్టు 6 వికెట్ల తేడాతో ఏటీఆర్ స్కూల్ (మహ్మదాబాద్) జట్టుపై, సెయింట్ ఏంజిల్స్ హైస్కూల్ జట్టు 9 వికెట్ల తేడాతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల న్యూటౌన్ జట్టుపై, రెయిన్‌బో హైస్కూల్ జట్టు 61 పరుగుల తేడాతో నాగార్జున హైస్కూల్ జట్టుపై విజయం సాధించాయి.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న లక్ష్మణ్‌గౌడ్

ప్రతి ఒక్కరూ బీమా చేయించుకోవాలి

నవాబుపేట: ప్రతి ఒక్కరూ బీమా చేయించుకోవాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి అన్నారు. బీమా పథకాలకు సంబంధించిన కరపత్రాలు శుక్రవారం విడుదల చేశారు. బీమా చేయించుకునేలా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు అవగాహన కార్యక్రమాలు ప్రారంభిస్తున్నామన్నారు. తన కార్యాలయంలో అందరికీ బీమా చేసే కార్యక్రమం ప్రారంభించి వారి బీమా డబ్బులు సైతం మొదటి విడతలో తనసొంత ఖర్చుతో చేయిస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సుధాకర చారి, ఆంజనేయులు, రఘువీర శర్మ, రాఘవేందర్, సురేష్, భాస్కర్ పాల్గొన్నారు.

దర్గాలో ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు

జడ్చర్ల: బాదేపల్లి పాతబజార్‌లోని హజ్రత్ అలీమ్ షా ఖలీమ్ షా దర్గా ఉర్సు సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఉర్సు నిర్వాహకులు ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు రబ్బానీ, మార్కెట్ వైస్ చైర్మన్ రాజేందర్‌గౌడ్, కౌన్సిలర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే సామగ్రి పంపిణీ



దేవరకద్ర: మండలంలో శుక్రవారం సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభమైంది. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్యుమరేటర్లకు సర్వేకు సంబంధించిన మెటీరియల్‌ను పంపిణీ చేశారు. అనంతరం దేవరకద్రలో జరిగిన సర్వేలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ కృష్ణయ్యలు పాల్గొని పర్యవేక్షించారు.

మహమ్మదాబాద్: సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మహమ్మదాబాద్ తహసీల్దార్ తిరుపతయ్య తెలిపారు. మండల కేంద్రంలో ఆయా గ్రామాల కార్యదర్శులకు శుక్రవారం సర్వే మెటీరియల్‌ను అందించారు. ఈసందర్భంగా ఆయన వారికి సర్వే పట్ల అవగాహన కల్పించారు. ఇప్పటికే ఆయా గ్రామాల కార్యదర్శులు గ్రామాలకు వెళ్లి కుటుంబాల గుర్తింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీఓ నరేందర్‌రెడ్డి, పీఆర్ ఏఈ ముతీమ్, డీటీ శేఖర్ పాల్గొన్నారు.

నవాబుపేట: ప్రభుత్వం తలపెట్టిన సామాజిక సర్వే చేసేందుకు సిబ్బందికి శుక్రవారం మండల అధికారులు సర్వే సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి స్టిక్కర్లు, సమాచారం నమోదుకు సంబంధించిన వివిధ రికార్డులను ఇచ్చారు. మండలంలో 88 మందిని సర్వే కోసం నియమించినట్లు ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు.

గండేడ్: ప్రభుత్వం చేపట్టనున్న సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభం కోసం ఆయా గ్రామాల కార్యదర్శులకు మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఆర్‌డీఓ ముసాయిదాబేగం మాట్లాడుతూ ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహించబోతున్న సర్వేను విజయవంతం చేయాలని సూచించారు. కార్యదర్శులకు మెటీరియల్‌ను అందజేశారు. ఎంపీడీఓ దేవన్న, తహసీల్దార్ నాగలక్ష్మి ఆయా గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరించిన పీయూ వీసీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ ఫార్మసీ కళాశాల హెచ్‌ఓడీ ప్రభాకర్‌రెడ్డి రచించిన ఏ కాంప్రహెన్సివ్ హ్యాండ్ బుక్ ఫార్మసిస్టు గ్రేడ్-2 అనే పుస్తకాన్ని పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ శుక్రవారం పీయూలో ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నూర్జహాన్, చిన్నదేవి, ఈశ్వర్ తదితరులు పాల్గొనారు.

రెండు రోజుల్లో డబ్బులు జమ

● ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన రైతులకు 48 గంటల్లో ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం దేవరకద్ర మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా ఎక్కడికక్కడ ధాన్యంను కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామన్నారు. గత ఏడాది ప్రతి పక్షంలో ఉన్నప్పుడు కల్లాల వద్దకు కాంగ్రెస్ అనే కార్యక్రమంతో రైతుల కల్లాల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నట్లు గుర్తుకు చేసుకున్నారు. ఆనాడు రైతులు పడ్డ కష్టాలు మళ్లీ పడకుండా కల్లాల వద్దకు ధాన్యం రాక ముందే కొనుగోలు కేంద్రాలను ముందుగానే ప్రారంభించినట్లు తెలిపారు. మద్దతు ధర రూ. 2320 తో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ కచ్చితంగా రైతుల ఖాతాలకు వేస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ కతలప్ప, వైస్ చైర్మన్ హన్మంతరెడ్డి, సెక్రటరీ జయలక్ష్మీ, సీఈఓ శ్రీనివాసులు, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏవో రాజేందర్ అగర్వాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, మండల నాయకులు అంజన్‌కుమార్‌రెడ్డి, కోనరాజ శేఖర్, జవహర్, వేణుగోపాల్‌రెడ్డి, రాంపాండు, శ్రీనివాస్‌రెడ్డి, ఫారూఖ్, జగన్నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

నాగారంలో...

దేవరకద్ర: నాగారం గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో శిథిలావస్థలో ఉన్న ఆసుపత్రిని ఎమ్మెల్యే పరిశీలించారు. నూతన భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో టీచర్ల కొరతను తీర్చడానికి డీఈఓతో మాట్లాడుతామని తెలిపారు.

పేదరిక నిర్మూలనకు కృషి చేసిన ఇందిరమ్మ

టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

స్టేషన్ మహబూబ్‌నగర్: పేదరిక నిర్మూలన కోసం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఎంతో కృషి చేశారని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం క్లాక్‌టవర్‌లో గల ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ కార్యాలయంలో సైతం ఇందిరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొత్వాల్ మాట్లాడుతూ ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు బ్యాంకులను జాతీయం చేసి ప్రజా సంక్షేమం కోసం విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ చైర్మన్ బెక్కరి అనిత, వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, నాయకులు చంద్రకుమార్‌గౌడ్, ఎన్పీ వెంకటేశ్, సీజే బెనహర్, సిరాజ్‌ఖాద్రీ, రాములుయాదవ్, అజ్మత్‌అలీ, గంజి ఆంజనేయులు, నాగరాజు, ఖాజపాష, తిరుమల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


ఇందిరాగాంధీ, వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

ఓర్వలేకనే ప్రభుత్వంపై విమర్శలు

స్టేషన్ మహబూబ్‌నగర్: సంక్షేమాన్ని చూసి ఓర్వలేకనే ప్రభుత్వంపై మాజీ మంత్రి విమర్శలు చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవలే ఓ వ్యక్తిపై పెట్టిన కేసు విషయంలో మాజీ మంత్రి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. మాజీ మంత్రి హయాంలోనే కేసులు పెట్టించి భయబ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు.ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ మాట్లాడుతూ బీసీలపై కేసులు పెట్టించింది మాజీ మంత్రి అని అన్నారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ మాట్లాడుతూ పదేళ్ల అవకాశమిస్తే మాజీ మంత్రి చేసిందేమీ లేదన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, కౌన్సిలర్ నర్సింలు, నాయకులు తిరుమల వెంకటేశ్, ఫయాజ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు వస్పుల విద్యార్థి

మిడ్జిల్: ఈనెల 2నుంచి 4వ తేదీ వరకు ఆసిఫాబాద్ జిల్లాలో నిర్వహించే 38వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలకు మండలంలోని వస్పుల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదవుతున్న గౌరిగె స్వప్న ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం వెంకటయ్య తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని, పీఈటీ శంకర్‌ను శుక్రవారం ఆ పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్ర స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తేవాలని సూచించారు.


రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన స్వప్నను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దేశానికి సేవ చేయడం గొప్ప విషయం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): దేశం కోసం తమ జీవితాన్ని త్యాగం చేసి సేవ చేయడం గొప్ప విషయమని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ అన్నారు. మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గణేష్ భవన్‌లో మాజీ సైనికులకు సన్మానించారు. ఈ సందర్భంగా ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ దేశం కోసం సైనంలో పని చేసి రిటైర్డ్ అయిన సైనికులకు ప్రభుత్వ పరంగా అండగా ఉంటామన్నారు. మాజీ సైనికుల సంఘానికి కమిటీ హాలు వచ్చే విధంగా కృషి చేస్తామని చెప్పారు. ఆ హాలు నిర్మాణానికి తన వంతుగా రూ. 10 లక్షలు ఆర్థిక సాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్, అడ్వైజర్ వెంకటయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


మాజీ సైనికులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్

'దైవ సేవకులు విశ్వాస జీవితంలో రాణించాలి'

స్టేషన్ మహబూబ్‌నగర్: దైవ సేవకులు దేవుడి వాక్యాన్ని ధ్యానిస్తూ, విశ్వాస జీవితంలో బలమైన వారిగా రాణించాలని మన్నా మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు పాస్టర్ బెంజిమెన్ కొమ్మనపల్లి పిలుపునిచ్చారు. స్థానిక సంఘాల సహకారంతో అప్పన్నపల్లిలోని వైట్ హౌస్ కన్వెన్షన్ హాల్‌లో గురువారం రాష్ట్రస్థాయి ఫెయిత్ అండ్ లైఫ్ విక్టరీ కాన్ఫరెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి రోజు దేవుడి వాక్యాన్ని ధ్యానిస్తూ, విశ్వాస జీవితంలో బలమైన వారంగా రాణిద్దామని పిలుపునిచ్చారు. దేశ క్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు పరంజ్యోతి, యేసుపాదం, సుందర్‌పాల్, జయపాల్, వేదాంతి, నాగరాజు, జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన దైవసేవకులు, విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

మహాగర్జనను జయప్రదం చేద్దాం

జడ్చర్ల టౌన్: పింఛన్ల పెంపు కోసం ఈనెల 26న ఇందిరాపార్క్ వద్ద మందకృష్ణ మాదిగ నేతృత్వంలో నిర్వహించే మహాగర్జనను జయప్రదం చేద్దామని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ నాయకుడు అందె రాంబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ కళాభవన్‌లో నిర్వహించిన వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈగర్జనకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో వికలాంగులతో పాటు ఒంటరి మహిళలు, వృద్ధులు, గీత, బీడీ కార్మికులు సైతం తరలి రావాలని కోరారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు నరేందర్, బిచ్యానాయక్, శ్రీనివాసులు, జైపాల్‌రెడ్డి, రఫీక్‌బాయ్ పాల్గొన్నారు.

సేవారత్న బాలకృష్ణకు ఘన సత్కారం

జడ్చర్ల టౌన్: వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ ద్వారా వాల్మీకి సేవారత్న అవార్డు గ్రహీత ఎంటీ బాలకృష్ణను శుక్రవారం మండల పరిధిలోని మాచారంలో ఘనంగా సత్కరించారు. గత నెల 30న హైదరాబాద్ త్యాగరాయ గాన సభలో వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ బాలకృష్ణకు అవార్డు ప్రదానం చేసింది. ఈ సందర్భంగా మాచారంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు. వాల్మీకుల ఐక్యత, సమస్యల సాధనలో అనేక ఏళ్లుగా బాలకృష్ణ చేస్తున్న సేవలు గుర్తు చేశారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకులు రాంచంద్రయ్య, తిరుపతయ్య,